సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 19 । జనవరి । 2025



రూ.1.25 లక్షల విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు పల్లపు శ్రీనివాసరావు, లక్ష్మీ పద్మావతి దంపతులు (గొంది) రూ.1.25 లక్షల విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.50 వేలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కొమ్మూరి సత్తిబాబు, వసంతలక్ష్మి దంపతులు (అల్లవరం) శని వారం రూ.50,001 విరాళం అందజేశారు.

9,745 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు ఎంపిక



రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికైన ఉషారాణి

నల్లజర్ల: ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు చీపురుగూడెం గ్రామానికి చెందిన డ్వాక్రా సీఏ తలంశెట్టి ఉషారాణి ఎంపికైంది. కృషి సఖీ సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ పొందడంతో ఆమెకు ఈ అవకాశం లభించింది. ఈ నెల 22వ తేదీన బయలుదేరి ఢిల్లీ వెళ్లనున్నట్లు ఆమె తెలిపారు.

వచ్చే నెల 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి



జిల్లా ఖజానా అధికారి సత్యనారాయణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఖజానా ద్వారా పెన్షన్లు పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ ఫించనుదార్లు తమ లైఫ్ సర్టిఫికెట్‌ను ఫిబ్రవరి 28వ తేదీలోగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి ఎస్.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ బయోమెట్రిక్ గుర్తింపు, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీతో ఆన్‌లైన్ ద్వారా కూడా దీనిని అందజేయవచ్చన్నారు. ఈ సంవత్సరానికి సంబంధించి ఈ నెల ఒకటో తేదీకి ముందు సమర్పించిన లైఫ్ సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ దగ్గర్లోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్ అందించవచ్చని సత్యనారాయణ తెలిపారు.

పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రానున్న ఐదేళ్లలో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటి మందికి ఉద్యోగాలు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రోగ్రాం ప్రారంభమైందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిదర్ రామన్, సహాయ సంచాలకుడు ప్రదీప్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.పెరుమాళ్లరావుతో కలిసి శనివారం తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో కూడిన విద్యను, 12 నెలలు పారిశ్రామికానుభవంతో అందించాలని సంకల్పించారన్నారు. పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా 20 కంటే ఎక్కువ రంగాల్లో యువతకు అవకాశాలున్నాయన్నారు. దీనికి 21–24 ఏళ్ల మధ్య వయసు కలిగి, ఉన్నత పాఠశాలలో చదువు పూర్తి చేసి, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ కలిగి ఉన్న వారితో పాటు ఆన్‌లైన్, దూరవిద్య ద్వారా నమోదు చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు 99489 95678, 73967 40041 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన వారికి 12 నెలల పాటు నెలకు రూ.5 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారన్నారు. ఏకకాల గ్రాంటు కింద రూ.6 వేలు కూడా ఇస్తారని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు.

అన్నదాతకు కరెంటు కోత!

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రోజుకు 9 గంటల సరఫరా
- కూటమి ప్రభుత్వ హయాంలో తొలుత గంట తగ్గింపు
- తాజాగా మరో గంట కుదింపు
- 9 గంటల స్థానంలో 7 గంటలకే పరిమితం
- దీనికి అనధికారిక కోతలు తోడు
- కీలక దశలో కోతలతో రైతుల ఆందోళన

సాక్షి, రాజమహేంద్రవరం: అధికారం చేపట్టిన నెలల వ్యవధిలోనే రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం నాంది పలికింది. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై సర్దుబాటు భారం మోపింది. ఇది చాలదన్నట్లు అన్నదాతలకు కరెంటు కష్టాల కడగండ్లు మిగిల్చేందుకు నాంది పలికింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా ఇస్తున్నామని ప్రకటనలు గుప్పించిన కూటమి సర్కార్.. కొద్ది రోజుల్లోనే విద్యుత్ సరఫరాను 9 నుంచి 8 గంటలకు తగ్గించింది. తాజాగా మరో గంట కుదించింది. విద్యుత్ అధికారుల ద్వారా ఎలాంటి ప్రకటనా చేయకుండా.. గుట్టు చప్పుడు కాకుండా అనధికారిక కోతలు అమలు చేస్తోంది. తద్వారా వ్యవసాయానికి 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తామనే సంకేతాన్ని రైతులకు ఇస్తోంది.

ఇదీ సంగతి

జిల్లా వ్యాప్తంగా 7,77,428 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థలవి 10,607, ప్రైవేటువి 7,66,821, వ్యవసాయ కనెక్షన్లు 25 వేలకు పైగా ఉన్నాయి. గతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు తొలుత రెండు విడతలుగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేసేవారు. అనంతరం తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తాజాగా ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయకుండానే అనధికారిక కోతలకు నాంది పలికాయి. దీంతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.



సాగునీటి బోరు

మెట్టకు బోర్లే ఆధారం

జిల్లాలో ప్రస్తుతం వరి సాగుకు నీటి లభ్యత ఆవశ్యకత పెద్దగా లేకున్నా.. నెలాఖరుకు అవసరమవుతుంది. మెట్ట ప్రాంతాలైన దేవరపల్లి, గోపాలపురం, చాగల్లు, నల్లజర్లలో కొంత భాగం, నిడదవోలు రూరల్, పెరవలి మండలంలోని కొన్ని గ్రామాలు, గోకవరం, రాజానగరం, అనపర్తి మండలాల్లో ఎక్కువ శాతం రైతులు సాగుకు బోర్ల నీటి పైనే ఆధారపడతారు. మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, చెరకు, జీడిమామిడి, పొగాకు, పత్తి తదితర పంటలకు వ్యవసాయ విద్యుత్ మోటార్ల ద్వారా అందించే బోరు నీరే ఆధారం. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే కీలక దశలో నీటి ఎద్దడి ఏర్పడి ఆయా పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు వాపోతున్నారు. అయితే, విద్యుత్ సరఫరా సక్రమంగా చేస్తున్నామని అధికారులు చెబుతుండగా.. 7 గంటలు మాత్రమే ఇస్తున్నారని రైతులు అంటున్నారు. అదేమని అడిగితే లోడ్ రిలీఫ్ (ఎల్ఆర్) ఇచ్చామంటూ విద్యుత్ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మెయిన్ సప్లై పోయిందని, ఎప్పుడొస్తుందో చెప్పలేమనే సమాధానం ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా ప్రతి రోజూ గంటపాటు అనధికారికంగా విద్యుత్ కోత విధిస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో కనీసం 5 గంటల సరఫరా కూడా సక్రమంగా అందుతుందో లేదోనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.



రాజానగరంలోని విద్యుత్ సబ్ స్టేషన్

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు

విద్యుత్ డివిజన్	కేటగిరీ–1 (ఇళ్లు)	కేటగిరీ–2 (పరిశ్రమలు, వ్యవసాయం)
నిడదవోలు	2,25,071	23,735
రాజమహేంద్రవరం రూరల్	1,98,390	20,528
రాజమహేంద్రవరం అర్బన్	2,12,425	32,761

సరఫరా ఇలా..

సాధారణంగా వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తొమ్మిది గంటల పాటు పగటి పూట నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి. నెల రోజులుగా రోజుకు గంట పాటు కోత విధించి, సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే ఇస్తున్నారు. రెండు రోజుల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతోంది. మరమ్మతులు, ఇతర అవసరాల పేరుతో ప్రతి రోజూ ప్రతి లైన్‌ను అరగంట నుంచి గంట వరకూ నిలిపివేస్తున్నారని చెబుతున్నారు.

గతం.. ఘనం

వ్యవసాయానికి పగటి పూటే నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టింది. అభివృద్ధి పనులకు నాంది పలికింది. విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టింది. అప్పటికి ఉన్న ఫీడర్ల సామర్థ్యం సరిపోదని భావించి, ట్రాన్స్‌మిషన్ కెపాసిటీ అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రూ.411 కోట్ల వ్యయంతో 26 కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి నాంది పలికింది. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ ఫీడర్లను సిద్ధం చేసింది. వ్యవసాయ కనెక్షన్లకు ప్రత్యేకంగా 1,920 కిలోమీటర్ల మేర 11 కేవీ డెడికేటెడ్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. 38 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు అమర్చింది. 132/33 కేవీ, 400/132 కేవీ, 220/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి నిర్మాణాలు పూర్తయి, సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కొన్నింటిని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. డెడికేటెడ్ లైన్ ఏర్పాటుతో వ్యవసాయ రంగానికి సరఫరా చేసే సమయంలో చిన్న, మధ్యతరహా, కుటీర పరిశ్రమలకు విద్యుత్ నిలిపివేసే అవస్థలు తప్పాయి.


పారదర్శకంగా రీసర్వే



తాడిమళ్లలో రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

నిడదవోలు రూరల్: గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని తాడిమళ్లలో చేపట్టిన రీసర్వేను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో రీ సర్వేకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించి, ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా భూముల రికార్డుల రూపొందించాలని చెప్పారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒకటి చొప్పున 16 గ్రామాల్లో రీసర్వే చేపట్టామన్నారు. భూ సమస్యలపై వినతులు స్వీకరించాలని, రీ సర్వేతో నష్టపోయిన రైతుల ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ జరగకుండా చూడాలన్నారు. అనంతరం ఉనకరమిల్లి గ్రామంలో సీసీ రోడ్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, డ్వామా పీడీ ఎ.నాగేశ్వరరావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు బి.లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ టి.వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనం



గరికపాటి నరసింహారావు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక శ్రీ సత్య సాయి గురుకులంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనం జరగనుంది. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో తొలి కార్యక్రమంగా ఈ ప్రవచనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. 'ప్రేమ – సేవ' అనే అంశంపై గరికపాటి ఉపన్యసిస్తారని తెలిపారు.



ఆవు, బుజ్జి దూడతో సాయి శ్రీనివాస్

బుజ్జి తువ్వాయి @ 19 అంగుళాలు

తల్లి గర్భాలయం నుంచి అప్పుడే ఈ లోకంలోకి వచ్చి.. లేలేత మృదువైన చర్మంపై మావి తడిని.. తల్లి నాలుకతో ఆప్యాయంగా నాకుతూంటే.. నేలపై సరిగ్గా నిలబడలేని తనను.. పడిపోకుండా పొదివి పట్టుకున్న యజమానిని అరమోడ్పు కన్నులతో కాస్తంత బెదురు చూపులు చూస్తూ.. అడుగున్నర ఎత్తుకు కాస్త అటుగా ఉన్న ఆ బుజ్జి తువ్వాయి చూపరులను ఎంతో ఆకట్టుకుంటోంది. ధవళేశ్వరంలోని అగ్రహారం ప్రాంతానికి చెందిన తదాల సాయి శ్రీనివాస్ ఇంట ఉన్న ఆవు.. ఈ 19 అంగుళాల పుంగనూరు పెయ్య దూడకు శనివారం జన్మనిచ్చింది. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆయన.. మూగజీవాలపై ఉన్న ప్రేమతో మూడేళ్లుగా పుంగనూరు ఆవును పెంచుతున్నాడు. దీనికి పుట్టిన బుజ్జి ఆవు పెయ్య దూడను చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – ధవళేశ్వరం

ఇలాంటి వరస్ట్ సీఎంను జీవితంలో చూడలేదు

- 7 నెలల కాలంలో చంద్రబాబు చేసిందేమీ లేదు
- ఆయన అబద్ధాలకు హద్దూపద్దూ లేదు
- ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి కుట్ర
- గోదావరి, కృష్ణా ,పెన్నా నదుల అనుసంధానం ఓ పెద్ద స్కెచ్
- మాజీ ఎంపీ హర్షకుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల ప్రాణాలకు విలువ ఇవ్వకుండా కేవలం కమీషన్ల కోసం ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్న చంద్రబాబు లాంటి వరస్ట్ సీఎంను తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ రద్దు చేసిన స్కీములన్నింటినీ తిరిగి ప్రారంభిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ చేయలేదన్నారు. సీఎం అబద్ధాలకు హద్దూపద్దూ లేనే లేదని, ఆయన నిజస్వరూపాన్ని ప్రజలందరూ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అధికారం వచ్చి ఏడు నెలలైనా ఇప్పటి వరకూ కూటమి నాయకుల్లో వాటాలు కుదరక టిడ్కో ఇళ్లు ఇవ్వలేదన్నారు. జగన్ ప్రభుత్వం ఉండగా గత ఐదేళ్లలో దళితుల మీద చంద్రబాబు చూపిన ప్రేమ ఇప్పుడేమైందని, వారి గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జగన్ పాలన ఐదేళ్లూ ఏబీఎన్, టీవీ–5 చానళ్లలో ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేశారని, ఇప్పుడలా చేయడం లేదని, దళితులందరూ ఆ చానళ్లను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, బీసీ, కాపులకు సంబంధించిన పథకాల పరిస్థితి అర్థం కావడం లేదన్నారు. అమరావతి, స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి అటకెక్కాయని, ప్రధాని నరేంద్ర మోదీ విశాఖపట్నం వచ్చినప్పుడు దీనిపై నోరు మెదిపే మగాడు ఒక్కడూ లేకపోయాడని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పునర్నిర్మాణం ఎప్పుడు మొదలు పెడతారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, మోదీ ఇద్దరూ దొంగలేనని, కలిసిపోయారని, ఇద్దరూ కలిపి పోలవరాన్ని ఏటీఎంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పులను ఇతరులపై వేయటానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. లోపభూయిష్టంగా నిర్మాణాలు చేశారని హర్షకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జియాలజికల్ సర్వే నిర్వహించి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలా పడితే అలా నిర్మిస్తే తీవ్ర నష్టం సంభవించే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కమీషన్ల కోసమే గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానానికి రూ.85,000 కోట్లు కావాలంటున్నారన్నారు. చంద్రబాబు నిజ స్వరూపాన్ని రాష్ట్ర ప్రజలు తెలుసుకోవాలని, ఆయనతో రాష్ట్రం అభివృద్ధి చెందదని, ప్రాజెక్టుల పేరుతో దోచేసే ప్రయత్నం చేస్తున్నారని హర్షకుమార్ ఆరోపించారు.

గోదావరి టు గంగ...

- మహా కుంభమేళాతో జిల్లాకు అనుబంధం
- ప్రయాగరాజ్‌కు భారీగా వెళ్తున్న భక్తులు
- ఇక్కడి నుంచే కొబ్బరి, వక్క ఎగుమతి

సాక్షి, అమలాపురం: గంగ.. గోదావరి. ఒకటి ఉత్తర భారతం.. మరొకటి దక్షిణ భారతదేశం. ప్రాంతం వేరైనా రెండింటికీ చాలా దగ్గర బంధం ఉంది. వీటి చుట్టూ రామాయణ, మహాభారత పురాణ గాథలున్నాయి. హిందువులకు సంబంధించి ఈ రెండు నదులను ఆనుకుని పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వీటిలో స్నానమాచరిస్తే పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. గోదావరి నదికి 12 ఏళ్లకోసారి పుష్కరాలు వస్తే, గంగకు సైతం 12 ఏళ్లకు పూర్ణ కుంభమేళా జరుగుతోంది. చనిపోయిన వారి అస్తికలు ఈ రెండు నదుల్లో కలపడం కూడా పుణ్యంగా భావిస్తారు. ఇవన్నీ చూసే గోదావరిని దక్షిణ గంగగా సంబోధిస్తారు. మహా కుంభమేళా క్రతువును వీక్షించేందుకు, పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేలాది మంది గోదావరి వాసులు ప్రయాగరాజ్ బాట పట్టారు. కుంభమేళా సందర్భంగా నదిలో నిర్వహించే పూజలు.. నదిని ఆనుకుని చేసే యజ్ఞాల్లో గోదావరి జిల్లాలో పండే కొబ్బరి.. పోక కాయల వంటివి ప్రముఖ స్థానంలో ఉంటాయి. తద్వారా గంగ, గోదావరి అనుబంధం మరోసారి తేటతెల్లమవుతోంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులు నదీ, సముద్ర పుణ్యస్నానాలకు ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే గోదావరి పుష్కరాల్లో ఒక్క చోట అని కాకుండా గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న ప్రతి ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేయడం సర్వసాధారణం. ఇది కాకుండా భీష్మ ఏకాదశి, చొల్లంగి అమావాస్య, అంతర్వేది కల్యాణోత్సవాల వంటి సమయాల్లో సముద్ర స్నానాలు చేసి పాప పరిహారం జరిగిందనుకుంటారు. అలాగే, దేశంలోని ప్రధాన నదులైన గంగ, యమున, సింధు, నర్మద, మహానది, కావేరి, కృష్ణ వంటి నదుల్లో పుణ్య స్నానాలకు సైతం భక్తులు తరలి వెళ్తారు. ఈసారి ప్రతి 144 ఏళ్లకు ఒకసారి వచ్చే కుంభమేళా కావడంతో ప్రయాగరాజ్ వద్ద స్నానాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. కాకినాడ, విజయవాడ, విశాఖ నుంచి ప్రయాగరాజ్‌కు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. కొంతమంది భక్తులు, హిందూ సంఘాల వారు బస్సులు ఏర్పాటు చేసుకుని మరీ మహా కుంభమేళాకు తరలి వెళ్తున్నారు. సంక్రాంతి పండగ ముగియడంతో గోదావరి జిల్లాల నుంచి దీనికి వెళ్లేవారి సంఖ్య మరింత పెరగనుంది.

అక్కడ కుంభమేళా... ఇక్కడ పుష్కరాలు

గంగ, గోదావరికి కుంభమేళా, పుష్కరాలతో పోలిక చెప్పవచ్చు. దేశంలోని ప్రధాన నదులన్నింటికీ 12 ఏళ్లకోసారి పుష్కరాలు జరుగుతాయి. కానీ గంగకు సాధారణ కుంభమేళా (నాలుగేళ్లకు), అర్ధ కుంభమేళా (ఆరేళ్లకు), పూర్ణ కుంభమేళా (12 ఏళ్లకు), మహా కుంభమేళా (144 ఏళ్లకు) ఒకసారి జరుగుతాయి. గోదావరికి ప్రతి 12 ఏళ్లకు ఒకసారి పుష్కరాలు జరుగుతాయి. గతంలో 2015లో జరిగిన పుష్కరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం పన్నెండు పుష్కరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరంగా ప్రచారం చేసింది. కుంభమేళా, గోదావరి పుష్కరాలకు మాత్రమే కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు చేస్తుంటారు. గోదావరికి సైతం 2027లో పుష్కరాలు రానున్నాయి. గతంలో 2015లో జరిగిన పుష్కరాలలో సుమారు 10 కోట్ల మందికి పైగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రధాన ఘాట్ల వద్ద పుణ్యస్నానాలు చేశారు. ఈసారి ఈ సంఖ్య మరింత పెరగనుందని అంచనా. గంగా నదిని ఆనుకుని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వారణాసి (కాశీ), హరిద్వార్, హృషీకేశ్, అలహాబాద్ ఉండగా, గోదావరిని ఆనుకుని నాసిక్, బాసర, కాళేశ్వరం, భద్రాచలం, రాజమహేంద్రవరం, కొవ్వూరు, అంతర్వేది, కోటిపల్లి, మురమళ్ల, అప్పనపల్లి వంటి పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వారణాసిలో గంగా హారతి, రాజమహేంద్రవరంలో గోదావరి హారతి ప్రత్యేకత చాటుతున్నాయి.

కుంభమేళాలో కోనసీమ కొబ్బరి.. వక్క

కుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌తో పాటు త్రివేణీ సంగమ ప్రాంతంలో జరుగుతున్న పూజలు, యజ్ఞాల్లో గోదావరి జిల్లాల్లో పండుతున్న కొబ్బరి, పోక (వక్క) ప్రధాన సామగ్రి అయ్యాయి. గంగతో పాటు ఉత్తరాదిలో నదుల్లో పువ్వులు, పత్రి, కొబ్బరి కాయలను వదలడం అక్కడి వారికి ఆనవాయితీ. దీంతో గోదావరి జిల్లాల నుంచి కురిడీ కొబ్బరి కుంభమేళాకు ఎగుమతి అవుతోంది. అలాగే యజ్ఞాలు, హోమాల్లో పచ్చి వక్క (పోక కాయలను) వాడుతుంటారు. ఇవి కూడా గోదావరి జిల్లాల రైతుల నుంచి వ్యాపారులు సేకరించి మహా కుంభమేళాకు పంపుతున్నారు.



ప్రయాగరాజ్ మహా కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న జనం

ఆ అనుభూతి వర్ణించలేం



పూర్ణ కుంభమేళాలో త్రివేణీ సంగమ ప్రాంతంలో నాగ సాధువులు, ఆ తరువాత ప్రొటోకాల్ ప్రకారం ఇతర సాధువులు పుణ్యస్నానాలు చేసిన తరువాత నేను స్నానం చేశాను. సాధువులు స్నానం చేసిన తరువాత దిగువన స్నానం చేస్తే కలిగే అనుభూతి వేరు. వారు స్నానం చేసిన నీటిలో సామాన్యులు స్నానం చేస్తే సాధువుల నుంచి వచ్చే వైబ్రేషన్స్ మనల్ని పునీతులను చేస్తాయి.

– చెరుకూరి కృష్ణంరాజు, మురమళ్ల, ఐ.పోలవరం మండలం



రాజమహేంద్రవరంలో గోదావరి హారతి (ఫైల్)



గోదావరి పుష్కరాల్లో భక్తుల పుణ్యస్నానాలు (ఫైల్)



మహా కుంభమేళాలో గంగా పూజలకు పంపనున్న కురిడీ కొబ్బరి

గుబాళించిన లాభాలు..

- పూల సాగు బహు బాగు
- నష్టంలేని పంటగా గుర్తింపు
- జిల్లాలో 15 వేల మందికి ఉపాధి

పెరవలి: సాగులో లాభాల గుబాళింపు వెదజల్లుతోంది.. పూల సాగు రైతుకు ఆనందం తెచ్చిపెడుతోంది.. రాష్ట్రంలో పూల సాగుకు కడియపులంకకు పేరుంది. దీనితో పాటు జిల్లాలో పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, తాళ్లపూడి, కడియం, నల్లజర్ల మండలాల్లో పూల సాగు లాభాల పరిమళాలు ఇస్తోంది.

ఇక్కడ ముఖ్యంగా బంతి పూలలో కారం, పసుపు, ఎరుపు రకాలు, చామంతిలో ఎరుపు, తెలుపు, పసుపు, పింక్, చిట్టి చామంతి రకాలు, గులాబీ, కనకాంబరం, మల్లె పూలు, జాజులు, విరజాజులు, లిల్లీపూలు వంటివి సాగు చేస్తున్నారు. పూల సాగు చేయటమే కాకుండా పూలను అమ్మే ఏకైక మార్కెట్ జిల్లాలో కాకరపర్రులో మాత్రమే ఉంది. ఈ హోల్‌సేల్ మార్కెట్ ఉదయం 10 గంటలకు ప్రారంభమై ఒక గంటతో ముగుస్తుంది. పూల సాగుతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుంది. పురుషులు పొలం పనులకు వెళ్తే, మహిళలు పూల దండలు కట్టి ఉపాధి పొందుతున్నారు. ఇలా సుమారు 15 వేల మంది జీవనం సాగిస్తున్నారు.


కాకరపర్రులో చామంతి తోట


అన్నవరప్పాడులో పూల తోట

పెట్టుబడి ఇలా..

పూల సాగుకు పెట్టుబడి తక్కువగానే ఉన్నా వీటిని చాలా జాగ్రత్తగా పెంచాలని రైతులు అంటున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా పంట చేతికి దక్కదని, జాగ్రత్తలు తీసుకుంటే మాత్రం రూపాయికి రూపాయి వస్తుందని చెబుతున్నారు. ఈ పంట రకాన్ని బట్టి ఎకరానికి రూ.30 నుంచి రూ.60 వేల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మార్కెట్‌లో ధర ఉంటే మాత్రం అంతా లాభమే. శుభకార్యాలు లేనప్పుడు మాత్రం కనీసం పూల కోతకు కూడా డబ్బులు రాని పరిస్థితి ఉంటుంది. జిల్లాలో 150 హెక్టార్లలో గులాబీ సాగు జరుగుతుంది. పంట ఒకసారి వేస్తే ఆరేళ్లు దిగుబడి పొందవచ్చు. ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేల పెట్టుబడి పెట్టాలి. ఏడాదికి ఒక మొక్కకు 300 పూలు పూస్తాయి. 280 హెక్టార్లలో చామంతి సాగు చేస్తున్నారు. ఎకరానికి 55 వేల మొక్కలు నాటొచ్చు. నారు నాటిన నెల రోజుల నుంచి దిగుబడి వస్తుంది. ఏడాదికి 5 నుంచి 8 టన్నుల పువ్వులు వస్తాయి. పెట్టుబడి రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టాలి. జిల్లాలో 250 హెక్టార్లలో లిల్లీపూల సాగు జరుగుతోంది. ఎకరానికి దిగుబడి 3 నుంచి 4 టన్నులు ఉండగా మూడేళ్లు సాగు చేసుకోవచ్చు. పెట్టుబడి రూ.40 వేలు అవుతుంది. 260 హెక్టార్లలో మల్లె సాగు చేస్తున్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.50 అవుతుండగా, దిగుబడి ఏడాదికి 3 నుంచి 4 టన్నులు వస్తుంది. 350 ఎకరాల్లో కనకాంబరం సాగు చేస్తున్నారు. పెట్టుబడి రూ.30 నుంచి రూ.40 వేలు అవుతుంది. ఏడాది పొడవునా దిగుబడి వస్తుంది. 450 హెక్టార్లలో బంతి సాగు జరుగుతోంది. మెట్ట, ఏజెన్సీ, డెల్టా ప్రాంతంలో దీనిని ఎక్కువగా రబీ పంటగా వేస్తున్నారు. పంట కాలం ఐదు నెలలు మాత్రమే. ఎకరానికి 10 వేల మొక్కలు నాటాలి. దిగుబడి ఎకరానికి 4 నుంచి 5 టన్నులు వస్తుంది. పెట్టుబడి రూ 50 వేలు అవుతుంది.

నష్టం మాత్రం రాదు



పూల సాగు నష్టాలు తెచ్చిపెట్టవు. వస్తే భారీగా లాభం వస్తుంది. లేకుంటే పెట్టుబడి తియ్యవచ్చు. ప్రతి ఏడాది ఏదో ఒక పూల పంట వేస్తున్నాను. పెట్టుబడి పోను ఎకరానికి సమయాన్ని బట్టి రూ.20 వేల నుంచి రూ.30 వేలు ఆదాయం వస్తుంది. ఈ పంటలు సాగు చేయటం అంటే ఆదాయం, ఆనందమే.

–సంగీతం వీరాస్వామి, పూల రైతు, కాకరపర్రు

గ్రామమంతా పూల సాగే..



ఆదాయం కావాలంటే పూల సాగు చేయాలి. ఎందుకంటే రూపాయికి రూపాయి లాభం వస్తోంది. అందుకే మా గ్రామంలో అంతా పూల సాగు చేస్తున్నారు. పూలు పూసినప్పుడు వచ్చే సుగంధ పరిమళాలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి. అలాగే సాగూ బాగుంటుంది.

–సామర్లకోట త్రిమూర్తులు, బంతి రైతు, కాకరపర్రు

తెగుళ్ల బెడద ఉండదు



ప్రతి ఏడాది బంతి సాగు చేస్తున్నాను. ఆదాయం ఎలా ఉన్నా ఈ తోటలోకి వచ్చేటప్పటికి మనసు ఉప్పొంగుతుంది. పూల సాగు అంతర్ పంటగా వేస్తాం. దీనివల్ల ప్రధాన పంటకు తెగుళ్ల బెడద ఉండదు. ఈ పంటలతో మిత్ర పురుగులు అధికమవుతాయి.

–పంపన బుచ్చియ్య, రైతు, కాకరపర్రు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ కాలేజీలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కర్ర బాబి, ఉపద్రష్ట విజయ్, గంటి కోటసాయి ఆధ్వర్యంలో ఈ పోటీలు పది రోజుల పాటు జరగనున్నాయి. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు పాల్గొన్నారు. తొలి మ్యాచ్‌లో విజయవాడ, అన్నవరం జట్లు తలపడగా అన్నవరం, అనంతరం కాకినాడ రుద్రాస్, రాజమహేంద్రవరం తలపడగా కాకినాడ రుద్రాస్ విజేతలుగా నిలిచాయి. కాకినాడ-2 శరవనభవ, నర్సీపట్నం జట్లు తలపడగా నర్సీపట్నం విజయం సాధించింది.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 72.44 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. 2025–26వ విద్యా సంవత్సరంలో 80 సీట్లకు గాను 8,971 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 6,499 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు 12వ తరగతి వరకూ ఇక్కడే విద్యనభ్యసిస్తారని ఆయన తెలిపారు.

దీర్ఘకాలిక సెలవుపై అల్లవరం ఎంపీడీఓ!

అల్లవరం: అల్లవరం ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లుగా సమాచారం. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో కమీషన్ ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చారంటూ ఆయనపై సదరు కాంట్రాక్టర్ జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓను దీర్ఘకాలిక సెలవుపై పంపించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డికి మాతృవియోగం

పెదపూడి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, రామవరం గ్రామ ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాతృమూర్తి బాపాయమ్మ (72) శుక్రవారం రాత్రి రామవరంలో గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఆమె రామవరం గ్రామ పాలక మండలి సభ్యురాలిగా పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి దంపతులు శనివారం కృష్ణారెడ్డిని పరామర్శించారు. బాపాయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేపీఆర్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యుడు కర్రి వెంకటకృష్ణారెడ్డి, ఫిజియోథెరపీ వైద్య నిపుణుడు కృష్ణారెడ్డి, రంగంపేట జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొల్లాటి ఇజ్రాయేలు, మాజీ జిల్లా పరిషత్ ప్రతిపక్ష నేత సత్తి రామారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, రామవరం గ్రామ సర్పంచ్ గిరడా గంగాభవాని, గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు గొలుగూరి గౌతమి, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల పార్టీ అధ్యక్షులు సత్తి రామాకృష్ణారెడ్డి, పోతుల ప్రసాద్‌రెడ్డి, గుత్తుల వెంకట రమణ, జిల్లా పార్టీ కార్యదర్శి పీవీ అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆదాడి సత్తిబాబు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ సత్తి నాగిరెడ్డి తదితరులు బాపాయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బాపాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ దంపతులు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

హోరాహోరీగా చదరంగం పోటీలు


క్రీడాకారులకు చెస్‌లో మెళకువలు చెబుతున్న రాజేష్

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో 13వ జాతీయ స్థాయి చదరంగం పోటీలు రెండో రోజూ హోరాహోరీగా జరిగాయి. ఎనిమిది హాల్స్‌లో జరుగుతున్న ఈ పోటీలను ఆలిండియా ఫెడరేషన్ ఆర్బిటర్స్ కమిషన్ చైర్మన్ ఆర్.రాజేష్ శనివారం పరిశీలించారు. చదరంగానికి సంబంధించి మెళకువలను క్రీడాకారులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసోసియేషన్ చైర్మన్ కేవీవీ శర్మ, ప్రెసిడెంట్ అడుసుమిల్లి, రతినం అనంతరామ్, సీహెచ్ విజయ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుకొండల వాడా.. వెంకటరమణా

- భక్తులతో కిక్కిరిసిన కోనసీమ తిరుపతి
- వెంకన్న నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

కొత్తపేట: కోనసీమ తిరుమలగా పేరొంది, ఆధ్యాత్మికతతో అలరారుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి క్షేత్రం ఆ శ్రీనివాసుని నామస్మరణతో మార్మోగింది.. శనివారం అశేష భక్తజనంతో కిక్కిరిసింది. ఆలయం నిత్య నూతనంగా దర్శనమిచ్చింది.. ఏడుకొండల వాసుడిని చూసి భక్తజనం మురిసిపోయింది. బ్రహ్మాండనాయకుడిని స్మరించి ప్రతి మదీ తరించింది. ఆలయ ప్రధాన అర్చకులు, పండితుల ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ధనుర్మాసం ముగిసిన నేపథ్యంలో సుప్రభాత సేవ తదితర నిత్య కార్యక్రమాలు పునః ప్రారంభించారు. సంక్రాంతి పండగ గడిచి, సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, రాష్ట్రం నలుమూలల నుంచి ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి వాడపల్లి క్షేత్రాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. స్వామివారు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్వామివారి అన్నప్రసాదాన్ని వేలాది మంది భక్తులు స్వీకరించారు. దేవదాయ– ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అట్టహాసంగా శోభాయాత్ర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- నేటి నుంచి సాధు పరిషత్ మహాసభలు

దేవరపల్లి: అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహాసభల సందర్భంగా శనివారం దేవరపల్లిలో శోభాయాత్ర అట్టహాసంగా జరిగింది. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సాధువులు పాల్గొన్నారు. తొలుత స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాతా పరవిద్యానందగిరి స్వామిని ఆధ్వర్యంలో సాధువులు పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సాధువులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. ప్రధాన రోడ్డు మీదుగా గ్రామ దేవత కడియాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి గ్రామ శివారున ఉన్న కరుటూరి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మహాసభల వేదిక వద్దకు చేరుకున్నారు. శోభాయాత్ర ముందు భాగాన సాధువుల నృత్యం చేస్తుండగా, చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సాధువులతో దేవరపల్లి కోలాహలంగా మారింది. వేదిక వద్ద వారికి దేవరపల్లి సభల ఆహ్వాన సంఘం ఘన స్వాగతం పలికింది. 19, 20, 21 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన సంఘం సభ్యులు తెలిపారు. సభలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 300 మంది పీఠాధిపతులు, 200 మంది సాధువులు హాజరవుతున్నట్టు వివరించారు.


దేవరపల్లిలో శ్రీవారి ఆలయం వద్ద సాధువులు

మతిని మార్చేదే మతం

మతి (బుద్ధి)ని మార్చేదే మతం అని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాత పరవిద్యానంద గిరి స్వామిని అన్నారు. దేవరపల్లిలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మానవులు ధర్మాన్ని ఆచరించాలని అన్నారు. మానవుడి బుద్ధి సన్మార్గంలో ఉంటే సమాజంలో శాంతి ఉంటుందన్నారు. అటువంటి జ్ఞానాన్ని వ్యాపింప జేయడానికి సాధు పరిషత్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. సంస్థను స్థాపించి 59 ఏళ్లయ్యిందని, ఏటా ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లోని సాధువు మహాత్ములు అందరూ కలిసి ఏర్పాటు చేసిన సంస్థ పరిషత్ అని ఆమె తెలిపారు. 60వ మహాసభలు మూడు రోజులు దేవరపల్లిలో జరుగుతాయన్నారు. భక్తుల సహకారంతో సభలు నిర్వహిస్తున్నామన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు

బాలికల విభాగంలో తూర్పుగోదావరి విజయం

పొదిలి రూరల్: ప్రకాశం జిల్లా పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న 28వ రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 32 బాలురు, బాలికల జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం జరిగిన బాలుర విభాగ ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం– కర్నూలు జట్లు నువ్వా నేనా అనేట్టు తలపడ్డాయి. ఇందులో ప్రకాశం జట్టు విజయం సాధించింది. మూడో బహుమతిని తూర్పుగోదావరి, అనంతపురం జట్లు సంయుక్తంగా గెలుచుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతిని తూర్పుగోదావరి, రెండో బహుమతిని ప్రకాశం జిల్లా జట్టు సొంతం చేసుకున్నాయి. మూడో బహుమతికి విజయనగరం, అనంతపురం జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. పోటీల్లో విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసులు, అమర్‌నాథ్, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ నంద్యాలలో జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి.


బాలికల విభాగంలో మొదటి బహుమతి పొందిన తూర్పు గోదావరి జట్టుకు బహుమతి ప్రదానం

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


- విజయదుర్గా పీఠంలో ఆధ్యాత్మిక శోభ
- నేడు 'గాడ్' జన్మదిన వేడుకలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 89వ జన్మదిన వేడుకలు రెండో రోజు కొనసాగాయి. శనివారం విజయదుర్గా అమ్మవారిని నయనానందకరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు దుర్గాఅష్టోత్తర, సహస్ర నామావళి, దుర్గా ద్వాత్రిశతి నామావళి, దేవీ శక్తిమాల అష్టోత్తర నామాలతో అమ్మవారిని పూజించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు పీఠానికి అందజేసిన శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులకు కల్యాణం కమనీయంగా చేశారు. పీఠం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవ విగ్రహాలకు పీఠాధిపతి గాడ్ సమక్షంలో శ్రీనివాసమంగాపురం దేవాలయ ప్రధాన అర్చకుడు బాలాజీ ఆధ్వర్యంలో వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చనలు చేశారు. అనంతరం తిరుమల వైఖానస పండితులచే శ్రీవారి దివ్య కల్యాణం నేత్రపర్వంగా సాగింది. కల్యాణంలో భాగంగా స్వామివారికి వివిధ పూజాధికాలు నిర్వహించారు. కల్యాణ విశిష్టతను వేద పండితులు వివరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీనివాస కల్యాణాన్ని వివరిస్తూ చేసిన వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం వేద పండితులు పీఠాధిపతి గాడ్‌కు శ్రీనివాసుని ప్రసాదాన్ని ఇచ్చారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు గాడ్ ఆశీస్సులు అందజేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి రీజినల్ కో ఆర్డినేటర్ కందర్ప హనుమాన్, ఆధ్యాత్మికవేత్త కోట సునీల్‌కుమార్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బి.రమ, పి.సత్యకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి) ఆధ్వర్యంలో పీఠానికి హాజరైన భక్తులకు అన్నసమారాధన జరిగింది. విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) 89వ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక ప్రముఖులు హాజరు కానున్నారు.


పీఠంలో శ్రీనివాస కల్యాణం చేస్తున్న పండితులు

అక్రమ అరెస్టులు దారుణం

పెరవలి: మండలంలోని సోషల్ మీడియా కార్యకర్త పంజా దుర్గారావును శుక్రవారం తణుకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అరెస్టు చేసిన పోలీసులు 41 నోటీస్ ఇచ్చి శనివారం మధ్యాహ్నం విడుదల చేశారని పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో పలు గ్రామాల నాయకులు పంజాకు పూలమాలలు వేసి ధర్మమే గెలిచిందని నినాదాలు చేశారు. అనంతరం ప్రసాద్, సత్యనారాయణ మాట్లాడుతూ అక్రమ అరెస్టులు ఎంతో కాలం నిలవవని, ఎమ్మెల్యే హోదాలో ఉండి ఒక సాధారణ ఆటో డ్రైవర్‌ను అక్రమంగా అరెస్టు చేయించటం దారుణమన్నారు. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. ఆటోకు అదిలేదని, ఇది లేదంటూ రూ.3,400 జరిమానా వేశారని, ఆ సొమ్ము చెల్లించినా అధికారులు ఆటోను వదలకపోవడం చాలా దారుణమని అన్నారు. సొమ్ము చెల్లించిన రసీదులతో ఆర్టీఓ కార్యాలయానికి పెద్ద ఎత్తున నాయకులు వెళ్తే.. సదరు అధికారి సెలవుపై వెళ్లడం, కార్యాలయంలో అధికారులను నిలదీస్తే ఆటోను విడుదల చేశారన్నారు. ఒక సామాన్య కార్యకర్తపై ఉన్నతాధికారులు ఇలా వ్యవహరించడం తగదని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు దొవులూరి శ్రీనివాస్, తోట సురేష్, బొకే వెంకటేశ్వర్లు, కొమ్మిశెట్టి చిన్ని, కరుటూరి గోపి, కనకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


దుర్గారావుకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న ఎంపీపీ, నాయకులు